## క్లుప్తంగా

### వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి రమేష్

**జగ్గంపేట:** చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ ఉపాధ్యాయులకు సూచించారు. జగ్గంపేట కాపు కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన గండేపల్లి, జగ్గంపేట మండలాల ఎస్ఆర్‌టీఎస్ ఉపాధ్యాయుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలో అమలు చేయవలిసిన పలు అంశాలను ఉపాధ్యాయులకు వివరించారు. ముఖ్యంగా ఐదో తరగతి విద్యార్థులకు చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలన్నారు. దీని కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీవైఈఓ ప్రభాకర శర్మ, జగ్గంపేట ఎంఈఓ స్వామి, గండేపల్లి ఎంఈఓ నాయక్, రెండు మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### విద్యార్థినికి సైకిల్ వితరణ



కామరాజుపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినికి సైకిల్ అందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయురాలు

**గోకవరం:** మండలంలోని కామరాజుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న గోనెపల్లి దేవికి పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు పూనెం అన్నపూర్ణ సైకిల్ వితరణ చేశారు. రూ.6 వేలు విలువైన సైకిల్‌ను గురువారం పాఠశాల హెచ్ఎం సారపు ఈశ్వరీదేవి చేతుల మీదగా విద్యార్థినికి అందజేశారు. ఉపాధ్యాయులు పెదిరెడ్ల రాజు, మేరీమాత, చక్రధర్, సత్యవతి, ధర్మరాజు, వెంకటేశ్వరరావు, బాపిరాజు పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

**గోకవరం:** మండలంలోని కొత్తపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఏఈ వై.సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. కొత్తపల్లి, రాజుపాలెం, కామరాజుపేట, జగన్నాథపురం, శివరామపట్నం, భూపతిపాలెం, సూదికొండ, మల్లవరం, గంగవరం, ఠాకూరుపాలెం గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

### గంజాయితో వ్యక్తి అరెస్టు



గంజాయితో పట్టుబడిన వ్యక్తితో సీఐ, పోలీస్ సిబ్బంది

**గోకవరం:** బైక్‌పై నాలుగు కేజీల గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు కోరుకొండ సీఐ సత్యప్రకాష్, ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గురువారం గోకవరంలో ఐఓసీఎల్ పెట్రోల్ బంకు వద్ద అల్లూరి సీతారామరాజు జిల్లా, అడ్డతీగలకు చెందిన మోటుకూరి తిరుపతిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. బైక్‌ను, గంజాయిని సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించినట్టు సీఐ తెలిపారు.

### సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

**ప్రత్తిపాడు:** మండలంలోని ఇ.గోకవరం గిరిజన తండాలో సారా స్థావరాలపై గురువారం ప్రత్తిపాడు ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివ ప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

**2800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం**

**రౌతులపూడి:** మండలంలోని ఎస్.పైడిపాలలో సారా స్థావరాలపై గురువారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 2800 లీటర్ల పులిసిన బెల్లం ఊటను ,ధ్వంసం చేసినట్టు తుని ఎక్సైజ్ సీఐ పట్టాభిచౌదరి, ఎస్సై శాస్త్రి తెలిపారు. ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

### సారాతో వ్యక్తి అరెస్టు

**గండేపల్లి:** మండలంలోని నాయకంపల్లిలో సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఐ శివబాబు గురువారం తెలిపారు. నాయకంపల్లిలో తనిఖీలు నిర్వహిస్తుండగా కె.ప్రసాద్ ఐదు లీటర్ల సారాతో పట్టుబడ్డాడన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించిందని తెలిపారు.

# వరివడిగా పంట ఒబ్బిడి

- ఫెంగల్ తుపాను హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన
- ఇప్పటికే మారిన వాతావరణం
- ఆదరాబాదరాగా పంట ఒబ్బిడి చేస్తున్న అన్నదాతలు
- తీరంలో నిలిచిన గంగపుత్రుల బోట్లు



ఎ.కొత్తపల్లిలో రహదారిపై నూర్పిడి చేస్తున్న రైతు కూలీలు

**తొండంగి:** వాతావరణంలో మార్పుల కారణంగా ఈ ఏడాడి ఖరీఫ్ రైతులు పరిస్థితి దినదినగండంగా మారింది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఫెంగల్ తుపానుగా మారింది. దీని ప్రభావంతో రెండు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. వాతావరణం మారడంతో ఖరీఫ్ రైతుల్లో గుబులు పట్టుకుంది. ఈ ఏడాది తొలకరి ప్రారంభం నుంచి అనావృష్టి, అతివృష్టి కారణంగా ఖరీఫ్ పంట సాగు కోసం రైతులు పడిన కష్టాలు వర్ణనాతీతం. డిసెంబర్ మూడు వరకూ ఫెంగల్ తుపాను ప్రభావం ఉంటుందని విశాఖ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ నేపథ్యంలో రైతులు ఖరీఫ్ పంటలను ఒబ్బిడి చేసుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.

**పంట చేతికందే దశలో...**

తుని నియోజకవర్గంలోని కోటనందూరు, తుని, తొండంగి మండలాల్లో దాదాపుగా 40 వేల ఎకరాల్లో ఈ ఏడాది ఖరీఫ్ వరిసాగు జరిగింది. అత్యధికంగా తొండంగి మండలంలో 16 వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఇప్పటికే మెట్ట గ్రామాలైన బెండపూడి, సీతారాంపురం, రావికంపాడు, కొమ్మనాపల్లి, పి.ఇ.చిన్నాయపాలెం తదితర గ్రామాల్లో పంట పక్వానికి రావడంతో యంత్రాలతో కోత కోయించి ఒబ్బిడి చేసుకున్నారు. తొండంగి మండల వ్యాప్తంగా ఇంకా 80 శాతం విస్తీర్ణంలో పంట కోత దశలో ఉంది. ఈ తరుణంలో తుపాను రావడంతో రైతులు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. పశుగ్రాసం కోసం కూలీలతో కోత కోయించిన రైతులు ఆదరాబాదరాగా పంటను ఒబ్బిడి చేసుకుంటున్నారు. తుపాను దెబ్బ తగిలితే



కోదాడలో మెషీన్‌తో వరికోతలు

పంట నష్టపోయి అప్పులపాలవుతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. వీలైనంత త్వరగా పంటలను కోత కోయించి ధాన్యాన్ని కల్లాల్లోనే అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో పంట కోత కోసే యంత్రాలకు మరింత డిమాండ్ పెరిగింది. మండల వ్యాప్తంగా వరికోతలు పూర్తికావడానికి మరో పది నుంచి పదిహేను రోజులుపైగా పట్టే అవకాశం ఉంది.

**సముద్రంలో చేపల వేటకు విరామం**

మండలంలోని తీరప్రాంతంలో అద్దరిపేట, పంపాదిపేట, కొత్తపేట, యర్రయ్యపేట, అన్నయ్యపేట,



జగపతినగరంలోని పొలాల్లో పనలపై ఉన్న వరి చేలు

వాడ ములసయ్యపేట, దానవాయిపేట, తాటియాకులపాలెం, పెరుమాళ్లపురం, హుకుంపేట, కొత్తచోడిపల్లిపేట తదితర మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో మత్స్యకారులు సముద్రంలో వేటపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రస్తుతం ఫెంగల్ తుపాను కారణంగా సముద్రంలో ప్రతికూల వాతావరణం నెలకొనడంతో వేటకు విరామం తప్పలేదు. ఈ ఏడాది తొలకరి ప్రారంభం నుంచి అధిక వర్షాల కారణంగా ప్రతికూల వాతావరణంతో అత్యధిక రోజులు వేటకు వెళ్లలేని పరిస్థితి. ప్రస్తుతం ఫెంగల్ తుపాను కారణంగా మరో వారం రోజుల పాటు వేటకు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో ఈ ఏడాది ప్రభుత్వం నుంచి మత్స్యకార భరోసా కూడా అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని మత్స్యకారులు వాపోతున్నారు.

**కిర్లంపూడి మండలంలో...**

**కిర్లంపూడి:** తుపాన్ హెచ్చరికలతో రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంటను వడివడిగా ఒబ్బిడి చేసుకుంటున్నారు. పొలాల్లో కోసి పనలపై ఉన్న వరి పంటను రక్షించుకునేందుకు రైతులు నానాపాట్లు పడుతున్నారు. పలు గ్రామాల్లో రైతులు కోతదశకు చేరిన పంటను యంత్రాల ద్వారా కోయించి ఒబ్బిడి చేసుకుంటున్నారు. కోత కోసి పొలాల్లో పనలపై ఉన్న పంటను రక్షింత ప్రాంతానికి తరలించి కుప్పలు వేస్తున్నారు. నూర్చిని ధాన్యాన్ని బరకాలతో భద్రపరుస్తున్నారు. కిర్లంపూడి మండలంలోని పలు గ్రామాల్లో గురువారం మెషీన్లతో వరి కోతలు కోయించారు. కోత కోసి పనలపై ఉన్న పంటను పొలాల్లో కుప్పలు పెడుతున్నారు. మండలంలో కిర్లంపూడి, జగపతినగరం, గోనేడ, బూరుగుపూడి తదితర గ్రామాల్లోని పొలాల్లో కోసిన వరి చేలు పనలపైనే ఉన్నాయి. 40 శాతం వరిచేలు కోత దశకు చేరుకున్నారు. తుపాను ప్రభావంతో రైతులు పంట కోయడానికి సాహసించడం లేదు. తుపాను నేపథ్యం వరి కోతలు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జోకా అమృత రైతులకు సూచించారు.

### రైతులకు అవగాహన కల్పించాం



తుపాను పట్ల క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాం. తుపాను ప్రభావానికి పంట దెబ్బతినకుండా వరి కోతలు వాయిదా వేసుకోవాలి. వరి కుప్పలపై బరకాలు కప్పి పంట వర్షానికి తడవకుండా చూసుకోవాలి. ఇప్పటికే పనలపై ఉన్న పంటను త్వరగా ఒబ్బిడి చేసుకోవాలి.

– ఎస్.నరసింహం, వ్యవసాయశాఖాధికారి, తొండంగి మండలం

### వరి కోతలు వాయిదా వేసుకోవాలి



శంఖవరంలో పంట పొలాలను పరిశీలిస్తున్న ఏఓ గాంధీ

**శంఖవరం:** తుపాను కారణంగా రానున్న రెండు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. మండలంలోని శంఖవరం, కత్తిపూడి తదితర గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను కారణంగా ఆదివారం వరకూ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వరి కోతలు కోయవద్దన్నారు. కోత కోసి పనల మీద ఉన్న పంటను కుప్పలుగా వేసుకోవాలన్నారు. నూర్చిన ధాన్యాన్ని ఎత్తయిన ప్రదేశాలకు తరలించి భద్రపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

**శంఖవరం:** రైతులు ఆయిల్ పామ్ సాగు చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని మండల ఉద్యాన అధికారి పి.అరుణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రమైన శంఖవరంలో పతంజలి ఫుడ్స్ ఆధ్వర్యంలో గురువారం ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఆయిల్ పామ్ సాగు అనువుగా ఉందన్నారు. ఎకరాకు రూ.లక్ష నికర ఆదాయం వస్తుందన్నారు. ప్రభుత్వం అందించే రాయితీలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ జె.అయ్యప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి టీడీవీ సత్యనారాయణ, సూపర్‌వైజర్ ఎం. వెంకట్రావు, వీఏడీ క్రాంతి కుమార్, రైతులు పాల్గొన్నారు.

### రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



గోపాలపట్నంలో స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తున్న భక్తులు

**తొండంగి:** మండలంలోని గోపాలపట్నంలో వేంచేసిన ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం పండితులు ఉమారామలింగేశ్వరుడు, పార్వతీదేవి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పెండ్లి రాట వేశారు. స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరించారు. సాయంత్రం గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శుక్రవారం రాత్రి 8 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకుడు యడ్ల శ్రీనివాస్ తెలిపారు.

### ఘనంగా కార్తిక వనసమారాధన

**గోకవరం:** మండలంలోని కృష్ణునిపాలెంలో పార్వతీ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. గ్రామస్తుల సహకారంతో ఈ వనసమారాధన ఏర్పాటు చేశారు. తొలుత ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ వనసమారధన నిర్వహించగా స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన సుమారు ఐదు వేల మంది పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### ఉచిత వైద్య శిబిరం

**ఏలేశ్వరం:** పట్టణంలో గురువారం ఉచిత వెన్నుముక వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక ఆపోలో ఫార్మసీ, రాజమహేంద్రవరానికి చెందిన వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వేద ఆసుపత్రి వైద్యుడు తేజోఫణీంద్ర, స్త్రీ వైద్యనిపుణులు పి. లక్ష్మీమృదుల రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఎముకలు దృఢంగా ఉంటాయన్నారు. స్త్రీలు రక్తహీనత లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అపోలో సిబ్బంది సుబ్బారావు, శివకృష్ణ, వేద ఆసుపత్రి సిబ్బంది పెద్దిరాజు, కొమిరేష్, మణి, దినకరన్ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

### గౌరీదేవికి సారె సమర్పణ

**ఏలేశ్వరం:** గౌరీశంకరుల ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో గురువారం గౌరీదేవి అమ్మవారికి సారె సమర్పించారు. స్థానిక నెయిలిపేటలో నెలకొల్పిన గౌరీదేవికి పలు రకాల పిండివంటలతో పాటు చీర, రవిక, సారె పెట్టారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సారెతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సమర్పించారు. కాగా గౌరీశంకరులను వచ్చే నెల 14న నిమజ్జనం చేయనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అలమండ దుర్గావెంకట ప్రసాద్, తూము రౌతు గురయ్య, బూర్లు సత్తిబాబు, బూడి సూరిబాబు, బెల్లాని శ్రీను, చల్లా గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో గౌరీదేవికి సారె సమర్పిస్తున్న భక్తులు

### సచివాలయ సిబ్బందికి శిక్షణ

**గండేపల్లి:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంఎస్ఎంఈ సర్వేపై సచివాలయ సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన పథకాలపై అవగాహన కల్పించినట్టు ఏఓ. చంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### స్వామివారికి విశేష అభిషేకాలు



కిర్లంపూడి శివాలయంలో నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న గిరిబాబు దంపతులు

**కిర్లంపూడి:** స్థానిక ఉమా వైద్యనాదేశ్వరస్వామి వారికి గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్తిక మాసం సందర్భంగా ఆలయ అర్చకులు బాదంపూడి సూరిబాబు, బాదంపూడిప్రసాద్ ఆధ్వర్యంలో ముద్రగడ గిరిబాబు, సిరి దంపతులు తొమ్మిది రకాల పండ్ల రసాలతో నందీశ్వరుడికి అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### హిందూ ధర్మం విశిష్టతను భావి తరాలకు అందించాలి



ఇర్రిపాకలో ద్వాదశ జ్యోతిర్లింగాల వద్ద పూజలు చేస్తున్న విధుశేఖరభారతీ స్వామి

**జగ్గంపేట:** హింధూ ధర్మం గొప్పదనాని భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని శృంగేరి పీఠాధిపతి జగద్గురు విధుశేఖర భారతీ స్వామి సూచించారు. మండలంలోని ఇర్రిపాకలో భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాలు, ఏలేరు నది తీరంలో నెలకొల్పిన ద్వాదశ జ్యోతిర్లింగాలను గురువారం ఆయన సందర్శించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దంపతులు, పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిజీకి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామీజీ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. రూపాలు వేరైనా భగవంతుడు ఒక్కడే అన్నారు. దేవుని ప్రార్థించడంతో పాటు భక్తి మార్గాన్ని చిత్తశుద్ధితో అనుసరిస్తే భగవంతుని అనుగ్రహం లభిస్తుందన్నారు. ఇర్రిపాకలో ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించినప్పుడు గొప్ప అనుభూతిని పొందానని తెలిపారు. ఇక్కడ నెలకొల్పే ఆధ్యాతిక కేంద్రానికి శృంగేరీపీఠం ఆశీస్సులు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు, దేవదాయ, ధర్మాదాయశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### సత్యదేవుని దర్శించిన దేవదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్

**అన్నవరం:** రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌చార్జి సెక్రటరీ, కమిషనర్ ఎస్.సత్యనారాయణ గురువారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వి.త్రినాథరావు ఆధ్వర్యంలో పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలను దేవస్థానం చైర్మన్ అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానంలో అభివృద్ధి కార్యక్రమాలను ఈఓ త్రినాథరావు ఆయనకు వివరించారు. భక్తులకు సౌకర్యాల కల్పన విషయంలో శ్రద్ధ వహించాలని, భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ధర్మాదాయ శాఖ ఇన్‌చార్జి సెక్రటరీ సత్యనారాయణ ఆదేశించారు. ఆయన వెంట దేవదాయశాఖ జిల్లా డీసీ రమేష్‌బాబు, దేవస్థానం డీసీ చంద్రశేఖర్, ఏసీ రామ్మోహన్‌రావు తదితరులు ఉన్నారు.



సత్యదేవుని సన్నిధిలో సత్యనారాయణకు వేదాశీస్సులు అందజేస్తున్న పండితులు

# బడుగుల ఆశాజ్యోతి ఫూలే

- మహాత్మా జ్యోతిరావు పూలేకు ఘన నివాళులు
- ఆయన సేవలను కొనియాడిన నేతలు



ఎస్.అన్నవరంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, వైఎస్సార్ సీపీ నాయకులు

**తుని రూరల్:** మహాత్మ జ్యోతిరావు పూలే బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, సంఘ సంస్కర్త అని మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. ఎస్.అన్నవరంలోని తన కార్యాలయంలో గురువారం జ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు. తొలుత పూలే చిత్రపటానికి మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటరానితనాన్ని, కుల వివక్షతను తీవ్రంగా వ్యతిరేకించిన మహనీయులు జ్యోతిరావుపూలే అన్నారు. ఆయన అడుగుజాడల్లో అందరూ నడవాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు ఏలూరి బాలు, రేలంగి రమణ గౌడ్, వేముల రాజబాబు, చింతకాయల చినబాబు, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, షేక్ ఖ్వాజా, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

**తుని:** స్థానిక పార్కు సెంటర్‌లో బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. జ్యోతిరావు పూలే, సావిత్రి భాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతిరావు పూలే బీసీ వర్గాల అభ్యున్నతికి చేసిన కృషిని బీసీ ఐక్యవేదిక తుని శాఖ అధ్యక్షుడు పి.గోవిందరావు కొనియాడారు. బీసీ సంఘాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

**ఏలేశ్వరం:** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కోనేటిబడి సమీపంలోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్యకుమార్ మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసం జ్యోతిరావు పూలే చేసిన సేవలు అపూర్వమన్నారు. నేటియువత పూలేను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కోరాడ ప్రసాద్, పైల విజయ్‌కుమార్, పతివాడ జగదీష్, కావలి శ్రీనివాస్, దాసరిగణేష్, విద్యార్థులు, టాక్సీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

**జగ్గంపేట:** గ్రామంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రావుల గణేష్‌రాజా ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. పార్టీ జగ్గంపేట పట్టణ అధ్యక్షుడు కాపారపు ప్రసాద్, పలువురు నేతలు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద జ్యోతిరావు పూలే విగ్రహానికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, విద్యుత్ డీఈ కార్యాలయం వద్ద విగ్రహానికి రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం సభ్యుడు కొత్త కొండబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**ప్రత్తిపాడు:** స్థానిక ఏగులమ్మ అమ్మవారి ఆలయ సమీపంలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి నియోజకవర్గ సీమాంధ్ర బీసీ సంఘం అధ్యక్షుడు, గ్రామ ఉపసర్పంచ్ మదినే నూకరాజు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి కట్టమూరి కొండబాబు, సంఘ నాయకులు నల్లమిల్లి నానాజీ, గొనగాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

**ప్రత్తిపాడు రూరల్:** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు ముదునూరి మురళి కృష్ణంరాజు అన్నారు. మండలంలోని ధర్మవరంలో జ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గొనగాల రాంమూర్తి, మచ్చర్ల రాజు, తూపాటి బాబ్జి, కోన బాబ్జి, కోలా తాతబాబు బొల్లు నాగేశ్వరరావు, పెండ్యాల అబ్బు, గొనగాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో జ్యోతిరావుపూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



జగ్గంపేటలో జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులు



ధర్మవరంలో పూలే చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న మురళీరాజు, పార్టీ నాయకులు

### బాధిత కుటుంబాలకు పరామర్శ



రాచపల్లిలో బాలకృష్ణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మురళీకృష్ణంరాజు, నాయకులు

**ప్రత్తిపాడు రూరల్:** మండలంలోని పలు బాధిత కుటుంబాలను గురువారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించారు. మండలంలోని రాచపల్లిలో బూతుకూరి బాలకృష్ణ కుమారుడు ధనుష్ ఇటీవల ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. వారి కుటుంబాన్ని మురళీరాజు పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ధర్మవరంలో గళ్లా చిట్టిబాబు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, గొనగాల రాంమూర్తి, మచ్చర్ల రాజు, తూపాటి బాబ్జి, కోన బాబ్జి, కోలా తాతబాబు బొల్లు నాగేశ్వరరావు, పెండ్యాల అబ్బు, గొనగాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.